
17—3—82



# రేపే దారి



**అంబరం** చీకటిని పులుముకుంటే నేలతల్లి వాన దేవుణ్ణి కావలించుకుంది.

హఠాత్తుగా వచ్చిన ఈ విపత్తుకు శ్రీనివాస మూర్తి చిరాకు పడ్డాడు. జల్లుకు కళ్ళజోడు మీద బిందువులు పడి బొత్తిగా కనబడకుండా చేసింది రోడ్డు. పైగా ఈ మధ్యనే కొన్న స్కూటరు...ఇంకా బాగా అలవాటు కాలేదు. అంచేత స్కూటరు స్పీడు తగ్గించి దగ్గర్లో ఉన్న చెట్టు నీడకు చేర్చాడు.

హిమాలయాల్లో తపస్సు చేస్తున్న ఋషి పుంగవుడిలా ఉందా చెట్టు. స్వపరభేదంలేకుండా నిర్మమతతో వానకు తడుస్తోంది.

శ్రీనివాసమూర్తి చిన్నప్పటినుంచీ ఈ చెట్టును ఎరుగును. హోం వర్క్ చేయ నప్పుడు స్కూలు ఎగగొట్టి ఈ చెట్టు కిందే గోలీకాయ లాడేవాడు. ఏ మహాను భావుడు నాటాడో గాని ఈ చెట్టు— ఆయన్ని మెచ్చుకోవలసిందే అనుకున్నాడు.

మబ్బులు విచ్చిపోయేలా కనిపించ లేదు. అసలే రవ్వంత గాలి కూడా వేయటం లేదు. బయట అంత వర్షపు జల్లు పడుతున్నా లోపల బనీను చెమ టతో తడిసిపోనే పోయింది. ఈ పాటికి ఇంటి దగ్గర వెచ్చగా భోంచేసి, కిళ్లీ బిగించి, వరండాలో భార్యామణితోసహా కూర్చుని రేడియోలో పాటలు వింటుండ వలసింది. ఖర్మకాలి ఈ వానలో ఇరు క్కున్నాడు. కాస్త ముందయినా చెప్పి వెంచేయ కూడదూ కాస్త ముంద స్తుగా జాగ్రత పడేవాడు.

శ్రీనివాసమూర్తి చెట్టు క్రింద దాక్కోటం వాన దేవుడికి ఇష్టం లేదల్లే ఉంది, ఎడాపెడా వాయించివేస్తున్నాడు. అటువైపు చోసారి —ఇటువైపు ఒకోసారి గాలితో సహా తిరుస్తున్నాడు. ఎక్కడి కైనా పోనీ పోయి దలదాచుకుందా మంటే చుట్టుపక్క లెక్కడా ఇళ్ళులేవు. తాను తొందరపడి ఈ చెట్టు కిందాగాడు. ఇంకొంచెం ముందుకు పోతే బస్ షెల్టర్ ఉంది. పైగా మెయిన్ రోడ్డు కూడా! ఏ షాపులోనైనా దూరేవాడే వాడు.

మెల్లగా చీకటి చిక్కబడుతున్నది. వీధి దీపాలు వెలిగినై గాని — వాటిని ఉపయోగించుకునే నాథుడే లేదు. ఆ రోడ్డున నర సంచారం లేదు. ఆంజ నేయ స్వామి దండకం అప్పటికే పది

**చంద్రమౌళి**

# సంస్మరణ



**శ్రీమతి అందే కృష్ణవేణి, M.A.**

జననం: 30—1—51   మరణం: 19—3—75

'ఇసుక తిన్నెలమీద మనశ్శాంతి కోసం
మౌనంగా కూర్చుంటే,
అట్లాంటిక్ సముద్రుడు వొచ్చి అదే పనిగా
గుండెఘోష వినిపిస్తున్నాడు!
ఔను! అంతా, నీరే, నీరే!!
అప్పుడే, నా గుండెకోత గుర్తుకొచ్చి,
విలపిద్దామనుకుంటే—
విన్నిక చూడలేని, ఈ కళ్ళనిండా కన్నీరే, కన్నీరే!!
అందుకే,
ఓ మృత్యువా! నన్నుకూడా కరుణించు!!'

సి,
గోపి.


నవసాహితి '82
వెలువడినవి!
మాదిరెడ్డి సులోచన
డైరెక్టు నవల
తొణికిన స్వప్నం రూ.16
మీరా రచయిత్రి లక్ష్మి డైరెక్టు నవల
పుష్యరాగం రూ.15
మైనంపాటి భాస్కర్ ప్రభ సీరియల్
మౌనరాగాలు — రూ.12
సి. జయబాలకృష్ణ భూమి సీరియల్
మనసా కవ్వించకే — రూ.11
నవసాహితి బుక్ హౌస్
ఏలూరు రోడ్ - విజయవాడ-520 002


పొన్లు పఠించాడు మూర్తి. మళ్ళీ గడియారం వంక చూసుకున్నాడు. ఎనిమిది తిరిగ్గా దాటుతున్నది నిముషాల ముల్లు. మళ్ళీ ఆకాశం వంక చూశాడు. మబ్బులు పల్చబడటం లేదు. కుండలతో గుమ్మరించినట్లు కుమ్మరిస్తున్నది వాన. మూర్తి కొంచెం చెట్టు దగ్గరగా జరిగాడు. ఎక్కడో, ఏదో అలికిడైంది. గాభరాగా నాలుగు వైపులా చూశాడు మూర్తి. ఎదురుగుండా ఎవరో అపరిచిత వ్యక్తి. బిచ్చగాడిలా ఉన్నాడు. ఎక్కడో చూసినట్లు గుర్తు.

"ఆ! తియ్యి! దబ్బున తియ్యి— ఆ కుడి జేబులో ఉండే—చచ్చిన గేదె పొట్ట ఉబ్బినట్లున్న పర్సు! ఊ! ఊ ఆలస్యం చేశావో — ఇదుగో!"

అంత చీకట్లోనూ కత్తి తెల్లగా మెరుస్తున్నది.

మూర్తి ప్రాణాలు పైని పైనే అలా— అలా — ఏదోగా కాసాగినై. మెల్లగా వణుకుతున్న చేతులతో పర్సు తీసి అంత దూరాన్నుంచి — అందులోంచి తను పెళ్ళినాటి ఫోటో తీసేసుకుని, పర్సు గిరవాటేశాడు— వాడి మీదకు, అందులో ఉన్న నెంజీరం మనసులోనే గుణించుకుంటూ. వాడు మెల్లిగా ఆ పర్సు తీసి, చిరిగిపోయిన పాంటు జేబులో భద్రంగా దాచుకున్నాడు.

మూర్తి నలుమూలలకూ బెరుకు బెరుకుగా చూస్తున్నాడు— ఎవరైనా ఆ దారిన పోతారా అని. పర్సు వదిలిపోయింది. ఇక వెళ్ళిపోతాడేమో అని అనుకుంటున్నాడు. కాని, వాడు కదల్లేదు.

"తియ్యి...ఆ చేతికున్న రిస్టు వాచీ— బొత్తిగా టయిము తెలిసి చావటంలేదు. ఊ!" పిడుగు పడ్డట్టు అదిరిపోయాడు మూర్తి.

"బాబ్బాబు, ఈ గడియారం వదిలి పెట్టేయ్! మా మామగారు పండక్కి పెట్టారు. నీకు పుణ్యముంటుంది."

వాడు బిగ్గరగా ఫీంకరించాడు. "మళ్ళీ పండక్కి పోయి తెచ్చుకో ఇంకోటి — ఊ! నా కవతల వేరే అపాయింట్‌మెంట్ ఉంది, తియ్యి."

వెనక ఏదో చప్పుడైతే అటు పక్కకు చూశాడు మూర్తి. గజ్జికుక్క తోకాడించుకుంటూ తన బూటు వాసన చూస్తున్నది. ఛీ అంటూ ఒక తాపు తన్నాడు.

వాడు బిగ్గరగా నవ్వుతున్నాడు. "నా మీద కోపం నోరులేని దాని మీద చూపిస్తావేం? ఊ! తియ్యి దబ్బున — లేకపోతే ..." మీదిమీదికి రాబోయాడు.

మూర్తి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పాపం మామగారు మామూలు గడియారం కొంటానంటే పట్టుబట్టి ఈ స్మగుల్డ్ వాచ్ కొనిపించుకొన్నాడు ముచ్చటపడి. అది తన ఏడో ప్రాణం!! (ఆరోప్రాణం భార్య.) తన ముఖం తన స్నేహితుల కెలా చూపించేట్టు? తన చేతకాని తనం ఎలా చెప్పుకొనేట్టు? మూర్తి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వెధవ డబ్బు పోతే పోయింది! మళ్ళీ సంపాదించుకోవచ్చు. ఈ గడియారం.. మళ్ళీ ఇలాంటిది దొరకద్దూ! బొంబాయి మంచల్లా తెప్పించాడు.

"ఊ!" మళ్ళీ ఉరుము.

నిరసంగా వాచీ ఒలిచి వాడిచేతి కందిచ్చాడు. అతని ముఖం చూస్తే అప్పగింత లప్పుడు పెళ్ళికూతురి తండ్రి ముఖంలా ఉంది.

వాడా గడియారాన్ని కళ్ళ దగ్గరగా పెట్టుకుని టయిము చూసి—"అబ్బో అప్పుడే ఎనిమిదైపోయిందే" అంటూ రెండో జేబులో కుక్కుకున్నాడు.

మూర్తికి ఎప్పుడో వాళ్ళ బామ్మ చెబుతుండే మెట్ట వేదాంతం జ్ఞాపకానికొచ్చింది 'ఎంతవరకు మనకు రుణమో అంతే వారి!' ఈ నాటితో ఆ గడియారానికీ, తనకూ ఋణం తీరిపోయింది. ఇకనైనా ఆ శనిగాడు తనని వదిలి వెళ్ళిపోతే బాగుండును.

"ఏం! అలా గద్దలా చూస్తున్నావ్ ఎప్పుడు వెళతావా అని! ఈ పాడు వానొకటి— ఇంకా తగ్గేట్టు లేదు. ఒక సిగరెట్ ముక్కుంటే పడేయ్... కార్చి చాలా నెలలైంది — ఒక దమ్ము లాగుతాను." మూర్తికి సిగరెట్లు ఇంకా అలవాటు కాలేదు. ఆ మాటే అన్నాడు వాడితో.

ఆకాశం దద్దరిల్లిపోయింది వాడి నవ్వుకు. "ఇంకా అలవాటు కాలేదా? ఈ సారి నే వచ్చేసరికి — మాంచి సిగరెట్టు పెట్టి ఉంచు. ఆ! అన్నట్టు — ఆ చేతివేలి కేమిటి మెరుస్తున్నది— ఉంగరం కాబోలు — అవునా?"

మూర్తి శరీరం మెల్లగా గడ్డకట్టుకు పోసాగింది. ఇంతవరకు గుండె దడవల్ల తన చేతికి ఉంగరం ఉన్న సంగతే మరిచిపోయాడు. లేపోతే వాడు చూడకుండా ఏ పాంటు జేబులోకో మెల్లగా జారవిడిచేవాడు.

"ఏదీ ఓసారి ఇలా ఇయ్యి—నా పెళ్ళప్పుడు మా మామగారి నడుగుతే ఇలాటి ఉంగరం పెట్టమని... ఏదీ— ఏం — రావటం లేదా! ఇలా దగ్గరకు రా నే తీస్తా."

"మూర్తి కళ్ళు బైర్లు కమ్మినై.

